
వారంతా నిరాశ్రయులు.. నా అనే వారు లేక రోడ్లపై దుర్భర జీవితం గడిపిన వారు కొందరైతే... మానసిక పరిస్థితి బాగోలేక తప్పి పోయి వచ్చిన వారు కొందరు. వీరంతా ఫుట్‌పాత్‌లు, కూడళ్లలో ఎండకు ఎండి.. వానకు తడుస్తూ కాలం వెళ్లదీసేవారు. అలాంటి వారికి ఆశ్రయం కల్పించాలనే లక్ష్యంతో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిరాశ్రయుల వసతి గృహాలు ఏర్పాటు చేశారు. ఆశ్రయం పొందుతున్న వారిలో ఎక్కువ మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు.. వృద్ధులు ఉన్నారు. ఇక్కడ ఒక్కపూట మాత్రమే భోజనం పెట్టడడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దాతలు దయ తలిస్తేనే వీరికి మూడుపూటలా ఆకలితీరుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహణ నిధులు పెంచాలని వారంతా కోరుతున్నారు.



దాతలే దిక్కు..!

నిరాశ్రయులకు ఒక్కపూటే భోజనం ● పట్టెడన్నం కోసం వృద్ధుల ఎదురుచూపులు

- బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో 26 మందికి ఆశ్రయం
- మూడుపూటలా భోజనానికి సరిపడా నిధులు పెంచాలని వేడుకోలు

విశాఖ విద్య: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయుల కోసం 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. నిరాశ్రయుల రాత్రి బస కోసం ఏర్పాటు చేసినప్పటికీ ఏ దిక్కులేని అనాథలు, నా అన్న వారికి దూరమైన వారు ఇక్కడకు ఎక్కువగా వస్తున్నారు. 25 మంది పురుషులకు ఆశ్రయం కల్పించేలా దీన్ని ఏర్పాటు చేశారు. అయితే పశ్చిమ నియోజకవర్గంలో ఇదొక్కటే అందుబాటులో ఉండడంతో ఇక్కడ ఎప్పుడూ సుమారు 30 మందికి పైగానే ఆశ్రయం పొందుతున్నారు.

పట్టణంలోని నిరాశ్రయులకు రాత్రిబస కేంద్రాలుగా జీవీఎంసీ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. రాత్రి వేళ మాత్రమే ఇక్కడ సేద తీరి, వెళ్లిపోవాలనేది నిబంధన. ఈ నేపథ్యంలోనే వసతి

దాతలు కరుణిస్తేనే..

గృహాల్లో రాత్రి పూట మాత్రమే జీవీఎంసీ ద్వారా భోజనం పెడుతున్నారు. కానీ, ఏ దిక్కూ లేని అనాథలు, బిడ్డల ఆదరణకు దూరమైన వారు, మతిస్థిమితం లేక తప్పిపోయి వచ్చిన వారు ఇక్కడ ఎక్కువగా ఉంటున్నారు. వీరంతా రాత్రి బస చేసి ఉదయానే వెళ్లిపోవడం అనేది అసాధ్యం. దీంతో నిర్వాహకులు వారిని ఇక్కడే ఉంచి వారి కుటుంబీల గురించి ఆరా తీసి పంపిస్తున్నారు. అంత వరకు ఇక్కడ ఉన్న వారంతా ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనానికి దాతల సాయం కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. షెల్టర్ మేనేజర్ మమత తనకు ఉన్న పరిచయాలు, అధికారుల సహకారంతో అల్పాహారం, మధ్యాహ్న భోజనం సమయానికి అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.


షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు

మహిళలకు ఏదీ చోటు!


బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ వసతి గృహం

బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ నిరాశ్రయుల షెల్టర్‌లో ఇటీవల వరకు మగవారితో పాటు, ఆడవారికి కూడా చోటు కల్పించారు. అయితే ఇక్కడ మగవారికోసమే షెల్టర్ అని తేల్చారు. బస్టాండ్‌కు సమీపంలోని టీఎస్సార్ కాంప్లెక్స్‌లో ఆడవాళ్లకు షెల్టర్ ఉన్నప్పటికీ, ఇప్పటికే అక్కడ పరిమితికి మించి ఉండడంతో అక్కడ వరకు వెళ్లలేని పలువురు వేర్వేరు ఆశ్రమాలను వెతుక్కోవాల్సి వచ్చింది. ఎన్‌ఏడీ సెంటర్‌కు ఓ వైపున సింహాచలం, మరో వైపున మర్రిపాలెం రైల్వే స్టేషన్లు ఉండడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే మతిస్థిమితం లేని వారు ఇక్కడ సంచరిస్తున్నారు. వీరిలో మహిళలు సైతం ఎక్కువగా ఉంటున్నారు. ఇలాంటి వారిని ఎవరైనా బుచ్చిరాజుపాలెం షెల్టర్‌కు తీసుకొచ్చినా మహిళలకు చోటు లేదని చెబుతుండడంతో తిరిగి వారు రోడ్ల పాలవుతున్నారు. జీవీఎంసీ అధికారులు ఇలాంటి విషయాలపై ఆలోచన చేసి మహిళల కోసం షెల్టర్లు పెంచాలని పలువురు కోరుతున్నారు.


భోజనం వడ్డిస్తున్న దాతలు

వైద్య పరీక్షలకు అవస్థలు

బుచ్చిరాజుపాలెం వసతి గృహానికి నిరాశ్రయుల తాకిడి దృష్ట్యా జీవీఎంసీ నిధులతో ప్రస్తుతం ఉన్న భవనంపై మరో షెడ్డు నిర్మిస్తున్నారు. ఇటీవల భెల్ యాజమాన్యం భవనం ముందు రేకుల షెడ్డు నిర్మించింది. అయితే వృద్ధులను ఆరోగ్య పరీక్షల కోసం ఆస్పత్రికి తీసుకెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. ఆ పరిస్థితి లేకుండా పక్కనే ఉన్న యూపీహెచ్‌సీ వైద్యులు ఆశ్రమానికి రెగ్యులర్‌గా వచ్చి సేవలు అందించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

చెల్లూరికి సేవా పురస్కారం


చెల్లూరి భాస్కరరావును సత్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రాంతానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావుకు కాకినాడకు చెందిన మానవ హక్కుల సంస్థ ప్రతినిధులు సేవా పురస్కారం అందజేశారు. నిరుపేదలకు సేవలు, తల్లిదండ్రులు వదిలేసిన వృద్ధులను వృద్ధాశ్రమాలకు తరలించడం, మానసిక రోగులను ఆస్పత్రికి తరలించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్న చెల్లూరి సేవలను గుర్తించి, కాకినాడలో బుధవారం జరిగిన సభలో ఈ పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా చెల్లూరి మాట్లాడుతూ ఇటువంటి పురస్కారాలు తన బాధ్యతను మరింత పెంచుతున్నాయన్నారు.

యూజీడీ సమస్యకు పరిష్కారం


ఎన్టీఆర్‌కాలనీలో యూజీడీ పనులు చేపడుతున్న జీవీఎంసీ సిబ్బంది

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ఎన్టీఆర్ కాలనీలో నిత్యం ఉత్పన్నమవుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలకు స్థానిక కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు కృషితో పరిష్కారం లభించింది. యూజీడీ సమస్యతో పడుతున్న ఇబ్బందులను కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన యూజీడీ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు ఎన్టీఆర్‌కాలనీలో యూజీడీ సమస్యకు చెక్ పెట్టారు. దీంతో స్థానికులు కార్పొరేటర్ లక్ష్మణరావుకు ధన్యవాదాలు తెలిపారు.

కమిషనర్ దృష్టికి సమస్యలు


సమస్యలను జీవీఎంసీ కమిషనర్‌కు వివరిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డులో పలు ప్రధాన సమస్యలతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు బుధవారం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని లక్ష్మణరావు తెలిపారు. సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ లక్ష్మణరావు చెప్పారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి


సమీక్షిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: సేవా కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుండాలని ఏయూ వైస్ ఛాన్స్‌లర్ జి. శశిభూషణరావు అన్నారు. బుధవారం నిర్వహించిన వర్సిటీ జాతీయ సేవాపథక వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడిన ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

విజయవాడస్పోర్ట్స్: రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికులను ఏమార్చి వారి జేబుల్లో నగదు అపహరిస్తున్న ముఠాను విజయవాడ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వన్‌టౌన్‌లోని సీసీఎస్ స్టేషన్ వద్ద క్రైం ఏసీపీ వెంకటేశ్వర్లు బుధవారం వెల్లడించారు. గోపాలపట్నంకు చెందిన బుర్రి సురేష్, అరిటాకుల తారకేశ్వరరావు, కైలాసపురానికి చెందిన కంబాల శ్రీను, కొబ్బరితోటకు చెందిన బుడుమూరి రాజు స్నేహితులని, గతంలో వీరు పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి జైలు జీవితం అనుభవించారని చెప్పారు. ఈ నలుగురు రద్దీ ప్రదేశాలను ఎంచుకుని అక్కడ ఎవరి వద్ద డబ్బులు ఎక్కువ ఉన్నాయో గ్రహించి, జేబులో నగదును ముఠాలోని ఒక వ్యక్తి దొంగిలించే సమయంలో మిగిలిన ముగ్గురు తోపులాట జరుగుతున్నట్లు, రద్దీ ఎక్కువగా ఉన్నట్టు అక్కడ వాతావరణాన్ని సృష్టిస్తారని తెలిపారు. ఈ తరహా చోరీలకు పాల్పడడంలో ఈ ముఠా ఆరితేరిందన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ ముఠా చోరీలకు పాల్పడుతుందన్నారు. ఈ నెల ఆరో తేదీన చల్లపల్లికి చెందిన ఓ వ్యక్తిని ఇదే మాదిరిగా ఏమార్చి అతని వద్ద ఉన్న డబ్బులు కాజేసినట్లు చెప్పారు. ఆస్పత్రిలో ఉన్న తన బావమరిది చికిత్స నిమిత్తం తీసుకొచ్చిన నగదును పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఈ ముఠా దొంగిలించిందన్నారు. కృష్ణలంక పోలీసులకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేశామన్నారు. పక్కా సమాచారంతో బస్టాండ్ సమీపంలోని పద్మావతి ఘాట్ వద్ద బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని వారి వద్ద నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో సీసీఎస్ సీఐలు అబ్దుల్‌సల్మా, రామ్ కుమార్ పాల్గొన్నారు.

అంధకారంలో సేవా మార్గం


యారాడ పార్కు వద్ద చీకటిగా ఉన్న సర్వీస్ రోడ్డు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధి మల్కాపురం నుంచి శ్రీహరిపురానికి వెళ్లే మార్గమధ్యలో యారాడ పార్కు వద్ద గల ప్రధాన సేవామార్గంలోని విద్యుత్ ఎల్ఈడీ లైట్లు రెండు వారాలుగా పని చేయడం లేదు. దీంతో ఆ మార్గంలో పూర్తిగా అంధకారం నెలకొంది. అసలే శీతాకాలం.. సాయంత్రం త్వరగా చీకటి పడటం, ఈ మార్గంలో లైట్లు కూడా వెలగకపోవడంతో వాహనచోదకులు, పాదచారులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. చీకటి పడితే ఆ మార్గంలో ప్రయాణించాలంటే భయపడుతున్నారు. ఏ గుంతలో వాహన చక్రం ఇరుక్కుంటుందో, స్పీడ్ బ్రేకర్‌పై ఎక్కడ అదుపు తప్పుతామో అని కలవరపడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా, వారు కూడా కనీసం స్పందించడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన లైట్లు వెలిగేలా చూడాలని కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు


పాల్గొన్న ముఖ్య కార్యకర్తలు

- ఆర్టీసీలో ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలి
- ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

ఉక్కునగరం: ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేస్తే కార్మికులు, ఉద్యోగులు మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తారని.. తద్వారా ఓఆర్ పెరుగుతుందని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. కూర్మన్నపాలెంలోని స్టీల్‌సిటీ డిపోలో బుధవారం జరిగిన ఉమ్మడి విశాఖ డిపోలకు చెందిన ఈయూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఉద్యోగులంతా విధి నిర్వహణలో బాధ్యతగా పని చేయాలని.. తప్పు చేయకుండా ఏ అధికారి అయినా కేసులు పెడితే ఉద్యమాలు చేయడానికి వెనుకాడవద్దని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న సుమారు 3 వేల మంది పదోన్నతులకు చెందిన ఫైల్‌ను క్లియర్ చేయాలని కోరారు. ఉప ప్రధాన కార్యదర్శి పి. భానుమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీలో సుమారు 10 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని భర్తీ చేస్తే పని భారం తగ్గడంతో పాటు మరిన్ని ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించవచ్చునన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్. రామారావు మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్ పెట్టిన నైట్ అవుట్ ట్రావెలింగ్, ఓటీ అలవెన్సులు అన్నీ చెల్లించాలన్నారు. జోనల్ అధ్యక్షులు కె.జె. శుభాకర్, కార్యదర్శి బి.కృష్ణమూర్తి, తొమ్మిది డిపోల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం


ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ మల్లికార్జునరావు

అగనంపూడి: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాలు, సైబర్ క్రైం, ఫోక్సో చట్టం, ర్యాగింగ్‌ల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయితో పట్టుబడిన ముద్దాయిలు, గంజాయి సేవించే వారిలో అత్యధికులు విద్యార్థులే ఉండడం బాధాకరమన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశతో ఈ దుశ్చర్యలకు పాల్పడుతూ నేరస్తులుగా జైళ్లలో మగ్గుతున్నారన్నారు. అలాగే సైబర్ క్రైం పట్ల అవగాహన ఉంటే మోసాలకు గురికాకుండా ఉంటారన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినా, బాలికలు, మహిళలను మానసికంగా వేధించినా ఫోక్సో చట్టం ప్రయోగించి జైల్లో వేయడం జరుగుతుందన్నారు. బాల బాలికలు వీటికి దూరంగా ఉంటూ బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణారావు, పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తర్వాత సంకల్పం ప్రతిజ్ఞ చేశారు.

శిథిల భవనం తొలగింపు


సులభ్‌కాంప్లెక్స్ భవనాన్ని తొలగిస్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో శిథిలావస్థకు చేరిన సులభ్ కాంప్లెక్స్‌ను బుధవారం తొలగించే పనులను ఇంజినీరింగ్ వర్క్స్ సిబ్బంది చేపట్టారు. సుమారు 20 ఏళ్ల కిందట నిర్మించిన ఈ సులభ్ కాంప్లెక్స్ ఆలనా పాలనా చూసే నాథుడు లేకపోవడంతో ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరింది. చిన్నారులు ఈ భవనం వద్దే ఆటలు ఆడుతుంటారు. శ్లాబ్ పెచ్చులు పడి ఏదైనా ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లితండ్రులు జీవీఎంసీ వర్క్స్ అధికారులకు వివరించారు. దీంతో వారు స్పందించి శిథిలావస్థలో ఉన్న ఆ భవనాన్ని తొలగించే పనులు చేపట్టారు.

సాధారణ గృహాలకూ కమర్షియల్ ట్యాక్స్

- కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రస్తావన


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 52వ వార్డులోని పలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి కమర్షియల్ ట్యాక్స్ వేశారని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కౌన్సిల్ సమావేశంలో గళం విప్పారు. గృహాలకు కూడా కమర్షియల్ ట్యాక్స్ వేసిన వాటిని పునఃపరిశీలించి, గృహాల యజమానులకు ట్యాక్స్‌ల భారం నుంచి విముక్తి కలిగించాలని కోరారు. దీనిపై అధికారులు స్పందించి పునఃపరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అలాగే వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను జియ్యాని సమావేశంలో ప్రస్తావించారు. వివిధ దశల్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

దివ్యాంగుల క్రికెట్ టోర్నీ విజేత తూర్పు గోదావరి


విజేత తూర్పు గోదావరి జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ దాలిబాబు, నర్సింగరావు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక జింక్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. తూర్పు గోదావరి జిల్లా జట్టు విజేతగా నిలవగా.. విశాఖ జట్టు ద్వితీయ స్థానంలో, విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు న్యూపోర్టు సీఐ దాలిబాబు, గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. ఉరుకూటి చైతన్య ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 10 జట్లు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో వందేభారత్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్ బాలు, ఏఎస్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత ఏఎస్ఆర్, గూటూరు శంకరరావు, బాటా శ్రీను, విశాఖ థ్రిల్లర్స్ సినీ డైరెక్టర్ వెంకట్, రంజిత్, స్వరూప్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగించారు

పోలీస్ గస్తీ ఏర్పాటు



సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..


మీ సేవా భవనం పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్న ఏసీపీ కాళిదాసు,సీఐ విద్యాసాగర్

మల్కాపురం: మీ సేవా భవనం వద్ద ఆకతాయిల ఆగడాలకు పోలీసులు చెక్ పెట్టే చర్యలు చేపడుతున్నారు. దీంతో ఆ కాలనీ వాసులు పోలీసులకు అభినందనలు తెలుపుతున్నారు. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి వెనుక గల మీ సేవా భవనం ఖాళీగా ఉండడంతో రాత్రి,పగలు అన్న తేడా లేకుండా ఆకతాయిలు చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీంతో ఎంఐజీ కాలనీ వాసులతో పాటు ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. దీనిపై ఈ నెల 10వ తేదీన 'ఆకతాయిల అడ్డా' అన్న శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. హార్బర్ ఏసీపీ కాళిదాసు, మల్కాపురం సీఐ విద్యాసాగర్ సిబ్బందితో బుధవారం ఆ ప్రాంగణానికి వెళ్లి అక్కడ పరిస్థితిని పరిశీలించారు.మీ సేవా భవనం ఆవరణతో పాటు చుట్టూ ఉన్న చెత్తా చెదారాన్ని 60వ వార్డు శానిటరీ సిబ్బందితో తొలగింపజేశారు.ఉదయం,సాయంత్రం,రాత్రి సమయాల్లో ఆప్రాంగణంలో ఆకతాయిలు చేరకుండా పోలీసులు గస్తీ పెంచారు. దీంతో మంగళవారం రాత్రి గానీ,బుధవారం ఆ పరిసరాలకు ఆకతాయిలు రాలేదని కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

లా కాలేజీలో భాషా ఉత్సవ్


ఉత్సవ్‌లో పాల్గొన్న ప్రొఫెసర్లు

విశాఖ విద్య: ఏయూలోని లా కాలేజీలో బుధవారం భారతీయ భాషా ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి చొరవ తీసుకున్నారు. ప్రొఫెసర్లు ఎస్.బి. చంద్రకళ, జి.రాఘవయ్య, ఎ.పద్మావతి, టి.నాగభూషణం, డాక్టర్ ఎల్.వి.కె.ప్రసాద్, డాక్టర్ ఆర్. వరప్రసాద్, డాక్టర్ కె.జగదీశ్వరరావు, డాక్టర్ డి.సుశీలతో పాటు లా కాలేజీ విద్యార్థులు, సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. డిజిటల్ స్పేస్‌లలో భారతీయ భాషలను ప్రోత్సహించడం, భారతీయ భాషల ద్వారా ఆవిష్కరణలు, పరిశోధనలను ప్రోత్సహించడం కోసం ఇలాంటి ఉత్సవాలు ఎంతో దోహదపడతాయని ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం అన్నారు. బహుభాషా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు, పాటలు, ఆటలు, వినోద కార్యక్రమాలు, పొడుపు కథల వంటి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు డిబేట్లు, సెమినార్లు నిర్వహించారు.

విద్యుత్ బిల్లులు దహనం చేయండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అల్లిపురం: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజలపై భారం వేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులను ప్రజలు, వ్యాపారులందరూ బహిరంగంగా దహనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జగదాంబ దరి సీపీఎం కార్యాలయంలో బుధవారం విశాఖ జిల్లా కమిటీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ చార్జీలు, ఇంధన చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో సలభై శాతం ప్రజలపై భారం మోపిందన్నారు. చిన్న షాపుల యజమానులు గత నెలలో రూ.600 కడితే డిసెంబర్‌లో రూ.1100 బిల్లు వచ్చిందన్నారు. 40 నుంచి 80 శాతం వరకు భారీగా రేట్లు పెంచారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2021–22 సంవత్సరానికి గాను ఈ నాలుగు రకాల చార్జీలు వేయడానికి సిద్ధం చేసింది కనుక అది తప్పనిసరిగా కట్టాల్సిందేనని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు మోపితే ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వ్యతిరేకించారన్నారు. అలాగే స్మార్ట్ మీటర్లు పెడితే వాటిని ధ్వంసం చేయండని లోకేష్ పిలుపునిచ్చారన్నారు. అధికారంలో లేనప్పుడు ఒక మాట వచ్చాక ఇంకొక మాట మాట్లాడటం సరి కాదన్నారు. ఈ భారం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అదే విధంగా గంగవరం పోర్టును స్వాధీనం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇస్తున్న సామాజిక పింఛన్, ఉపాధి హామీ పథకంలో కోతలు పెట్టేందుకు కొత్తగా సర్వేలు జరపడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. విశాఖ పోర్టులో డ్రగ్స్ షిప్‌ను పట్టుకున్న సీబీఐ ఇప్పుడు ఆ షిప్‌లో ఏమీ లేదని తేల్చడం వెనుక మహా కుంభకోణం ఉందన్నారు. మోదీ మాయలో పడి ఆ షిప్‌ను వదిలేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. టన్నుల కొద్దీ రేషన్ బియ్యం కాకినాడ, విశాఖ పోర్టుల నుంచి అక్రమంగా తరలిపోతుండగా పట్టుకున్న కూటమి ప్రభుత్వం ఏ ఒక్కరిపైనా కేసులు పెట్టలేదన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.